# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 94 | పేజీలు : 08 | శనివారం | 11-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు ఇస్తాం

మంత్రి సీతక్క..



భద్రాద్రి కొత్తగూడెంహైదరాబాద్ పల్స్

అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు

తరువాయి 2 లో

## భారీ ఎత్తున అవినీతి జరుగుతోంది



గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందన్న కవిత

ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో రేవంత్ కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ఆరోపణ

నిధులు దారిమళ్లిస్తున్నారంటూ విమర్శలు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను

## దేవుడే నన్ను పంపాడు



కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి.. 'దేవుడే నన్ను పంపాడు' అంటూ భావోద్వేగం

ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి

సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్ తదితరులు

ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందన్న జీవన్ రెడ్డి

2

## తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు



బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి

కూసుమంచి మండలంలో కొత్తగా నిర్మించిన గోదామును ప్రారంభించిన పొంగులేటి

గత ప్రభుత్వ ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న మంత్రి

రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తున్నామని వెల్లడి

ఇందిరమ్మ రాజ్యాన్ని మరోసారి దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య

2

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు

డీజీపీ ముందు డిప్యూటీ కమాండర్ కేశాలు సహా 42 మంది లొంగుబాటు

పోలీసుల ఎదుట లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు

లొంగిపోయిన వారిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు

సోది కేశాలు లొంగుబాటును కీలకంగా భావిస్తున్న పోలీసులు

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు ఉన్నారు. బెటాలియన్ కమాండర్ సోది కేశాలు లొంగుబాటును పోలీసులు కీలకంగా భావిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలను పోలీసులకు సరెండర్ చేశారు. వీటిలో ఏకే47 సహా పలు అధునాతన ఆయుధాలున్నట్లుగా సమాచారం. లొంగిపోయిన వారిలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నట్లుగా తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోలు తెలంగాణ పోలీసులను ఆశ్రయించి లొంగిపోయారు.

మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారని వెల్లడించారు. అధికశాతం మంది ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందినవారున్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీలను అందిస్తామని శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మొత్తం రూ.1.93 కోట్లను అందజేస్తున్నామని వివరించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులను అందజేస్తామన్నారు. గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్ రెడ్డి తెలిపారు.

మిగిలిన వారు కూడా లొంగిపోవాలి

తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు మావోయిస్టు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారని

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనులు

మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం

ఈ విమానాశ్రయంతో మారిపోనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

2





## పెరిగిన కరవు భత్యం

2

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్...

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు

50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరిన కరవు భత్యం

జనవరి 2026 నుంచి అమల్లోకి రానున్న పెంపు

సంస్థపై నెలకు రూ.2.82 కోట్ల అదనపు ఆర్థిక భారం

38 వేల మందికి పైగా సిబ్బందికి ప్రయోజనం

# మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక

మూడు గంటల పాటు కొనసాగిన కేబినెట్ సమావేశం


సమావేశానంతరం మంత్రులతో చంద్రబాబు ప్రత్యేక భేటీ

ప్రభుత్వ సమాచారం లీక్ అవుతుండటంపై సీఎం సీరియస్

మరోసారి రిపీట్ అయితే మంత్రులను బాధ్యులను చేస్తానంటూ వార్నింగ్

గతంలో ఇలాంటి లీకుల వల్లే కేబినెట్‌ను ఎన్టీఆర్ రద్దు చేశారని గుర్తు చేసిన వైనం

2



హైదరాబాద్ పల్స్,అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా,

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు..

మొదటి పేజీరువాయి

తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి

# దేవుడే నన్ను పంపాడు

మొదటి పేజీరువాయి

*తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఈరోజు కలిశారు. కేసీఆర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆలింగనం చేసుకుని, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో పాటు ఆయన కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కూడా ఆయనతో పాటు ఉన్నారు.పాత మిత్రులు కలవడంతో అక్కడ ఎంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది. కేసీఆర్‌ను చూడగానే జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే మీ దగ్గరికి పంపాడు, మీతో కలిసి పనిచేయమని కోరాడు" అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చాలా కాలం తర్వాత ఇన్నాళ్లకు కలిసి పనిచేసే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.అంతకు ముందు, ఎర్రవెల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు*

# తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

మొదటి పేజీరువాయి

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

మొదటి పేజీరువాయి

ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది.రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

# భారీ ఎత్తున అవినీతి జరుగుతోంది

మొదటి పేజీరువాయి

నగర

అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు.ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

మొదటి పేజీరువాయి

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# పెరిగిన కరవు భత్యం

మొదటి పేజీరువాయి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది.డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ. 2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ. 954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు ఇస్తాం

మొదటి పేజీరువాయి

కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ. 11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ. 11 వేలకే అయితే రూ. 14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఉరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు

మొదటి పేజీరువాయి

ప్రస్తుతం ఆ సంఖ్య రెండుకు పడిపోయిందని శివధర్ రెడ్డి తెలిపారు. స్టేట్?కమిటీ మెంబర్లు 24 ఉంటే ప్రస్తుతం ఆసంఖ్య రెండుకు పడిపోయిందన్నారు. ఆర్‌సీఎంలు ఇద్దరు ఉండే ఒకరు అట్లానే ఉన్నారని వివరించారు. డివిజన్ కమిటీ సెక్రటరీ మెంబర్ స్థాయిలో ఉన్నవారు 36 మంది ఉంటే ఇవాళ ఆ సంఖ్య ఒకటికి వచ్చిందని వివరించారు. దళ సభ్యులు 30 మంది ఉండేవారని ప్రస్తుతం ఎవరూ లేరని వివరించారు.

**లొంగిపోయిన వారికి రివార్డులను అందజేత**

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే పునరావాస ప్యాకేజీ కింద రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ. 20 లక్షలు, డివిజనల్ కమిటీ కార్యదర్శికి రూ. 8 లక్షలు, మెంబర్?కు రూ. 5లక్షలు ఏరియా కమిటీ మెంబర్‌కు రూ. 4లక్షల ఇస్తున్నామన్నారు. కేంద్రహోంశాఖ మార్గదర్శకాల ప్రకారం జనజీవన స్రవంతిలోకి ఆయుధాలతో లొంగిపోయిన ఎల్ఎంజీకి రూ. 5 లక్షలు, ఏకే-47 తీసుకువస్తే రూ. 4లక్షలు, ఎస్ఎల్ఆర్‌కు రూ. 2లక్షలు రివార్డుల రూపంలో మొత్తం 42 మందికి రూ. 1.93 కోట్లను అందిస్తామన్నారు.

**మావోయిస్టు ఉద్యమం ముగిసినట్టేనా**

తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని పోలీసులు చెబుతున్నారు. ఆపరేషన్? కగార్ ప్రభావంతో అనేక మంది ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది ఆ పార్టీ నేతలు అడవి వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో మావోయిస్టు పార్టీ బలహీనపడింది. ఆ పార్టీ అగ్రనేతలు ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిపై ఉన్న రివార్డులను ప్రభుత్వం అందజేసింది. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు జల్లెడ పట్టడంతో మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బతగిలింది. క్రమక్రమంగా మావోయిస్టు పార్టీ బలహీన పడింది. తాజాగా మరో 42 మంది లొంగిపోవడంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది.

# ప్రభుత్వ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, సంగారెడ్డి ప్రతినిధి:**
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. శుక్రవారం పటాన్ చెరువు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. మధ్యస్థ విద్య అనంతరం ఉండే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచిస్తూ, విద్యార్థి జీవితంలో తొమ్మిదవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకు అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని అంకితభావంతో కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వం పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నదని, ఈ అవకాశాలను వినియోగించుకుని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని, కష్టపడే వారికి విజయమే లభిస్తుందని తెలిపారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ కూడా అవసరమని వివరించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, నిల్వ గది, వంటగదిని పరిశీలించి, నూతనంగా ఏర్పాటు చేసిన చపాతీ తయారీ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా డ్రైవర్లకు
# ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు : జిల్లా ఎస్.పి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, సంగారెడ్డి ప్రతినిధి:**
ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు "అరైవ్ అలైవ్" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కార్యక్రమాలపై జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, యువకులతో గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి, గ్రామాల్లో ఉన్న రోడ్డు సమస్యలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించడం, రోడ్డు ప్రమాదాల దృశ్యాలను ఎల్ఈడి స్క్రీన్లు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు చూపించడం, గోడలపై వాల్ పెయింటింగ్‌లు వేయించడం, పోలీసు కళా బృందాల ద్వారా నాటికలు ప్రదర్శించడం ద్వారా అవగాహన పెంచాలని తెలిపారు. పోలీసులే ముందుగా ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, నిబంధనలు ఉల్లంఘించిన పోలీసులపై కూడా చలానాలు విధించాలని ఆదేశించారు. ఆటో, లారీ, బస్సు డ్రైవర్ల సంఘాలతో సమావేశాలు నిర్వహించి ట్రాఫిక్ నియమాలపై చర్చించాలని, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, లౌడ్‌స్పీకర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు, డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్పీ పిలుపునిచ్చారు.

# సిగ్నల్ తండ యువకుడి అద్భుత విజయం

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలో ప్రథమ స్థానం సాధించిన కిరణ్ కుమార్ కు ఘన సన్మానం







**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని సిగ్నల్ తండకు చెందిన గుగులోతు వీరన్న, సరిత దంపతుల ప్రథమ సంతానం కిరణ్ కుమార్ తన ప్రతిభతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. కిరణ్ కుమార్ స్థానిక సెయింట్ ఆగ్నేష్ పాఠశాలలో విద్యను పూర్తి చేసి, ఆర్థిక శాఖకు చెందిన కేంద్ర విభాగంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగ నియామక పరీక్షలో ప్రథమ స్థానాన్ని సాధించారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. సందర్భంగా శుక్రవారం నాడు సెయింట్ ఆగ్నేష్ పాఠశాల ప్రిన్సిపాల్ హెలేన్ రాణి, కరస్పాండెంట్ పసాల ఆంటోనీ ఆధ్వర్యంలో కిరణ్ కుమార్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు వీరన్న, సరితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కిరణ్ విజయాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన కిరణ్ కుమార్ ఇంతటి ప్రతిభ కనబరచడం అభినందనీయమని, ఆయన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఈ విజయంతో మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. గ్రామస్థులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

# రిపోర్టర్ ఉపేంద్ర చారి పై ఆలేరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

### పత్రికా ముసుగులో బ్లాక్మెయిల్ దందా
### కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కాండ్రాజు వెంకటేశ్వరరాజు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తనపై అసత్య కథనాలు రాసి పరువు ప్రతిష్టలకు, వ్యక్తిగతంగా నష్టం కలుగజేశారంటూ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కాండ్రాజు వెంకటేశ్వరరాజు, ఆలేరు కు చెందిన ఓ ప్రముఖ దిన పత్రికకు సంబంధించిన విలేఖరి హనుమకొండ ఉపేంద్ర చారి పై శుక్రవారం ఆలేరు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ యాలాద్రికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆలేరు రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీపై వార్త రాయొద్దు అనుకుంటే ఒక లక్షల రూపాయలు ఇవ్వాలని ఉపేంద్ర చారి డిమాండ్ చేస్తూ, బ్లాక్ మెయిల్ కు పాల్పడ్డారు. అంతేకాకుండా తన పేపర్లో వచ్చిన స్టేట్మెంట్ లను ఫేస్ బుక్ ఇన్స్టా లతో సహా వివిధ సామాజిక మాధ్యమాలలో మరియు వాట్సాప్ గ్రూపులో షేర్ చేసి ఎంతో పవిత్రంగా భావించే, పత్రికా వృత్తికి కళంకం తీసుకొచ్చారన్నారు. తనపై దురుద్దేశపూర్వకంగా కావాలనే, బురద జల్లడంతో పాటు, అసత్య వార్తలను రాసిన ఉపేంద్ర చారితోపాటు, అందుకు కారణమైన నరసింహ రాజు పై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్ఐ కి ఇచ్చిన వినతి పత్రంలో ఆయన కోరారు. వాస్తవాలను తెలుసుకోకుండా తనను పరువు పోయే విధంగా అప్రతిష్ట పాలు చేసేందుకు తన పత్రిక ద్వారా అబద్ధపు వార్తలు రాస్తున్నాడు అని ఆరోపించారు తనకు వరుసకు సోదరుడైన నరసింహ రాజు చెప్పిన అంశాలు వాస్తవమా, కాదా అని తెలుసుకోకుండా వివరణ అడగకుండా రాయడం సరైంది కాదన్నారు ఆయన రాసిన కథనాలలో తాను భాగస్వామిని కాదని తన సోదరుడైన నరసింహ రాజుకు న్యాయం చేసేందుకు పెద్దమనిషిగా ఉన్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు తాజా మాజా వైస్ ఎంపీపీ గాజుల వెంకటేష్, రెండో వార్డ్ వానరాసి మార్క్, ఉప సర్పంచ్ గాజుల దశరథ, ఎస్ట్ సెల్ మండల అధ్యక్షులు క్రాంతి నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు కర్రె అజయ్, పర్రె రమేష్, ప్రకాష్ రెడ్డి, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అందె అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నగూడెంలో నూతన దంపతులకు ఘన ఆశీస్సులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, మహబూబాబాద్ ప్రతినిధి :**
రామన్నగూడెం గ్రామంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి మేనల్లుడు నల్ల ఉదయ్ రెడ్డి – శ్రావణి నూతన దంపతులను మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ శుక్రవారం నిండు మనసుతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉగ్గంపల్లి సర్పంచ్ ఆయుబ్ భాష, నారెడ్ల గాంధీ రెడ్డి, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో విషాదం: ఎస్. కె. సైదా ఆకస్మిక మృతి - నేతల శ్రద్ధాంజలి, కుటుంబానికి పరామర్శ



**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 10, మహబూబాబాద్ ప్రతినిధి**
డోర్నకల్ పట్టణంలోని న్యూ నెహ్రూ స్ట్రీట్‌లో నివసిస్తున్న (గోర్బీ) సోదరుడు ఎస్. కె. సైదా శుక్రవారం ఆకస్మికంగా మరణించిన వార్త స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సైదా తన సౌమ్య స్వభావం, సహృదయతతో అందరికీ సన్నిహితుడిగా ఉండేవారని స్థానికులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సైదా పార్థీవ దేహానికి పూలమాలలు అర్పించి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. డోర్నకల్ మున్సిపాలిటీ చైర్మన్ భర్త కొండేటి హరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, రెండో వార్డ్ కౌన్సిలర్ బానోత్ ప్రమీల రమేష్ నాయక్, మాజీ వార్డు సభ్యులు బసిక అశోక్, గాజుల వేణు, కొత్తపల్లి నర్సింగ్, నాయిని వెంకటేశ్వర్లు, ఎస్.కె. సర్వర్, శృంగారపాటి వినోద్ తదితరులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సైదా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ తమ సానుభూతిని తెలిపారు.

# బాలాపూర్ కోల్డ్ స్టోరేజీ నిండా కుళ్లిపోయిన మాంసం : హైదరాబాద్ సిటీలో మనం తింటున్నది ఇదేనా ఏంటీ..?




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, మెయిన్ డెస్క్ :**
బాలాపూర్ పోలీసులు, జి.హెచ్.ఎమ్.సి అధికారులు సంయుక్తంగా సలామి కోల్డ్ స్టోరేజ్ లో తనిఖీలు నిర్వహించారు. కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ పెట్టిన మాంసాన్ని గుర్తించారు. పక్కా సమాచారంతో పక్కా సమాచారంతో మదీనా కాలనీ లోనీ సలామి ఇండస్ట్రీ కోల్డ్ సోరేజ్ పై దాడి చేశారు అధికారులు. సంచులలో నింపిన టన్నుల కొద్దీ మాంసాన్ని చూసి షాకయ్యారు. కుళ్లిపోయి, బూజు పట్టిన స్థితిలో ఉన్న మాంసం దుర్వాసన కొడుతుండటంతో అధికారులు ఇబ్బందులకు గురయ్యారు. కోల్డ్ స్టోరేజ్ లో ఉన్న మాంసాన్ని సీజ్ చేసిన అధికారులు.. మాంసం ఇండస్ట్రీ ఓనర్స్ పై చర్యలకు సిద్ధమయ్యారు. ఇలాంటి ఇండస్ట్రీలపై బాలాపూర్ పోలీస్ లు మరింత ఫోకస్ పెంచారు. మొత్తం ఐదు స్టోరేజీల నిండా కుళ్ళిపోయిన కాళ్లు ,తలకాయలు, మాంసం ఉన్నట్లు భావిస్తున్నారు. మొదటి స్టోరేజ్ లోనే ఇంత ఘోరమైన పరిస్థితులను చూసిన అధికారులు.. వరుసగా అన్ని స్టోరేజీలను చెక్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహారాన్ని నిల్వ ఉంచిన వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# ఉపాధి హామీ పథకం రక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉధృతమవుతున్న ఉద్యమం

**గాంధీ పేరు తొలగింపుపై తీవ్ర ఆందోళనలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, మహబూబాబాద్ ప్రతినిధి :**
ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఉద్యమం రోజురోజుకు ఉధృతమవుతోంది. ముఖ్యంగా మహాత్మా గాంధీ పేరు తొలగించే ప్రయత్నాలపై కార్మికులు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గాంధీ పేరు తొలగిస్తే దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టి ఢిల్లీ గద్దె కదిలిస్తామని నాయకులు హెచ్చరించారు. జాతీయ మరియు రాష్ట్ర స్థాయి నాయకుల పిలుపు మేరకు ఈ ఉద్యమం గ్రామస్థాయి వరకు విస్తరించింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కురివి మండలం లింగ్యతండాలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జాతీయ చైర్మన్ ఉదిత్ రాజ్, తెలంగాణ చైర్మన్ కౌశల్ సమీర్ ఆదేశాల మేరకు రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్న జానీ, అబ్దుల్ జిలాని, మహబూబాబాద్ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీమియా, లింగ్య తండా సర్పంచ్ స్వరూప, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం నాయకులు ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారికి పథకం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీలు, కార్మికుల హక్కులను బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ పేద ప్రజల జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. హాజరు నమోదు విధానంలో మార్పుల కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనంలో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని కూలీలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పథకం అమలు లోపాల వల్ల కూలీలకు సమయానికి వేతనాలు అందకపోవడం, పనులలో ఆలస్యం జరగడం వంటి సమస్యలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. కూలీల పొట్టకొట్టి కాంట్రాక్టర్లకు లాభాలు ఇవ్వడం దుర్మార్గ పాలనకు నిదర్శనం ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రజాశక్తితో తిప్పికొడతాం""గాంధీ గారి పేరు తొలగించడం అంటే దేశ స్వాతంత్ర్య చరిత్రను అవమానించడం"అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది మందితో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి ఢిల్లీకి తరలివెళ్లి నిరసనలు తెలుపుతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో లింగ్య తండా గ్రామస్థులు, ఉపాధి హామీ కూలీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు.



# తెల్లబండ తండాలో తాగునీటి బలోపేతం: బోరింగ్లు, మోటర్ల పునరుద్ధరణ వేగవంతం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, మహబూబాబాద్ ప్రతినిధి :** డోర్నకల్ మండలం పరిధిలోని తెల్లబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలో వేసవి కాలంలో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా శుక్రవారం గ్రామ సర్పంచ్ జాటోత్ సంధ్య సుమన్ నాయక్ ,ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఉన్న చేతి పంపులు (బోరింగ్‌లు), బోరు బావులు మరమ్మతు పనులను ప్రారంభించారు.గత ఐదు సంవత్సరాలుగా బోరింగ్‌లు, సోలార్ మోటర్లను రిపేర్ చేయకుండా వదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో, వాటిని పునరుద్ధరించి, అవసరమైన చోట కొత్త మోటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్యలతో గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గుగులోత్ వెంకన్న, గుగులోత్ పార్వతి రామారావు, కంటెస్టెడ్ 5వ వార్డు మెంబర్ జర్పుల మహేశ్వరి–ఉపేందర్ పాల్గొన్నారు. అలాగే గుగులోత్ మాన్య, భూక్యా బాలోజి, బానోత్ వెంకన్న, భూక్యా సర్వన్, భూక్యా నరేష్, గుగులోత్ రామారావు, జర్పుల భాస్కర్, భూక్యా సురేష్, సపావత్ సురేష్, గుగులోత్ సిద్దు, బానోత్ ఈరు తదితర గ్రామస్థులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కిషన్, వెంకన్న, అమర్‌సింగ్, రాజు కూడా ఈ పనుల్లో చురుకుగా పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా నివారించేందుకు తీసుకుంటున్న ఈ చర్యలను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

# .బయ్యారం మండలం లక్ష్మీపురంలో రోడ్డు ప్రమాదం - వ్యక్తికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 10, మహబూబాబాద్ ప్రతినిధి**
బయ్యారం మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఫంక్షన్ నిమిత్తం బైక్‌పై ప్రయాణిస్తున్న మోకాళ్ళ స్వామిని ఎదురుగా వేగంగా వచ్చిన మరో బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఒక్కసారిగా చోటుచేసుకోవడంతో అక్కడి ప్రజలు ఆందోళనకు గురయ్యారు.ఈ ప్రమాదంలో స్వామికి దవడ ఎముకకు తీవ్రమైన గాయం కాగా, ఎడమ చేయి విరిగినట్లు తెలిసింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే బయ్యారం 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఈఎంటి శ్రీను, పైలట్ అశోక్ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



# మూడోసారి ముడిపడిన పడవ రేవు పాట



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని చర్ల మండలం పెద్దిపల్లి పంచాయతీలో పడవ రేవు పాట నిర్వహించిన పంచాయతీ అధికారులు. రెండు దఫాలుగా పడవు రేవు పాట నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రాకపోవడంతో వాయిదా వేసిన అధికారులు. మూడవసారి రేవు పాటు నిర్వహించగా 7,90,000 కు తెల్లం. భీమరాజు రేవు పాటను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పడవ రేవు పాట దారుడు తెల్లం. భీమరాజు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం. 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పడవ రేవులో ప్రయాణికులను దాటించడం జరుగుతుందని కావున ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనితి. రామకృష్ణ, ఎంపీ.డీవో ఈదయ్య, పంచాయతీ సెక్రెటరీ సామ్రాజ్యం, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్పీఎంలో అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం

**వెంటనే గుర్తింపు కార్మిక సంఘశీ ఎన్నికలు నిర్వహించాలి.**
**ఎస్ పి ఎం మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు జే. మల్లికార్జున్ డిమాండ్.**




***హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:***
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం యూనియన్ జనరల్ సెక్రటరీ కూషణ. రాజన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిది గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అనేక పరిశ్రమలలో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ కూడా సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి లేబర్ కోడ్లను అడ్డుపెట్టుకొని ఎన్నికలకు అడ్డు తగులుతుంది, ఇది సరైన ధోరణి కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్లును ఇంకా ఆమోదించలేదని రాష్ట్రంలో ఇంకా రూల్స్ ఫ్రేమ్ కాలేదని, రాష్ట్రంలో ఎక్కడ లేబర్ కోడ్స్ అమలు కావడం లేదని రాష్ట్రంలో అనేక పరిశ్రమలో ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ మధ్యకాలంలో పది పరిశ్రమలలో ఎన్నికలు నిర్వహించారని కావున ఎస్పియంలో కూడా గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఎస్ పి ఎం మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాల్ మాట్లాడుతూ 2026 ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఎస్ పి ఎం కార్మికులకి జరగవలసిన వేతన ఒప్పందశీ సజావుగా జరగాలంటే గుర్తింపు కార్మిక సంఘం తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఎస్పీఎం లో అనేక చట్టబద్ధమైనటువంటి సౌకర్యాలు కూడా యాజమాన్యం కావాలని తాత్సారం చేస్తుందని, ఎగవేత ధోరణితో వ్యవహరిస్తుందని, పరిశ్రమ తెరిసి 8 సంవత్సరాలు గడిసిపోయాయి పూర్తిస్థాయిలో ఉత్పత్తి వస్తుంది ఈ క్రమంలో కూడా కార్మికులకు కల్పించే కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుంది. కార్మికులు తీవ్రమైనటువంటి అన్యాయానికి గురి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల కోసం అన్ని యూనియన్లు కలిసి యాజమాన్యం మీద ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం సి ఐ టి యూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు ముంజం శ్రీనివాస్, మహమ్మద్ షబ్బీర్, మొగిలి వెంకటేష్, సహాయ కార్యదర్శులు గడమల్ల మహేష్, కాశీపేట రాజేందర్, రామ్ శెట్టి రాజన్న, బిల్ల రమేష్, కోశాధికారి నీలి రాజన్న సి ఐ టి యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. త్రివేణి. మరియు రాజేందర్. పేపర్ మిల్ లోని వివిధ డిపార్ట్మెంట్ లోని కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేఎస్ పీపీ 4వ స్నాతకోత్సవం

**ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ పూర్వ సీఈవో**
**35 మంది పట్టాల ప్రదానం**
**నలుగురు ప్రతిభావంతులకు బంగారు పతకాలు బహుకరణ**



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :** కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తన నాలుగో స్నాతకోత్సవాన్ని ఏప్రిల్ 10, 2026న హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ఒక లాంఛనప్రాయ విద్యా ఊరేగింపు (అకడమిక్ ప్రొసెషన్)తో ప్రారంభమై, సందర్భానికి తగ్గ గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించింది.ఈ వేడుకలో నీతి ఆయోగ్ పూర్వ ముఖ్య కార్యనిర్వహణాధికారి, భారతదేశపు జీ–20 షెర్పా అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన ప్రసంగంలో, ఆయన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, దేశ నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తూ, ప్రజా విధానం, పరిపాలనకు అర్థవంతంగా దోహదపడాలని పట్టభద్రులైన విద్యార్థులను ప్రేరేపించారు.క్షేత్రస్థాయి పరిపాలన ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, భారతదేశ సమాఖ్య నిర్మాణంలో కీలకమైన రాష్ట్రాలు, జిల్లాలతో మమేకమవ్వాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. తయారీ రంగంలో వాటాను పెంచడం, వ్యాపార వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'జన విశ్వాస్' (ప్రజా విశ్వాసం)కు ప్రాధాన్యతనిస్తూ, ఎగుమతులను పెంచడానికి, భారతదేశ ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగు పరచడానికి విశ్వాసాన్ని బలపేతం చేయడం, వ్యాపార పరిస్థితులను మెరుగుపరచడం చాలా కీలకమన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని పేర్కొంటూ, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు.బలమైన ఆవిష్కరణ వ్యవస్థ కోసం పిలుపునిస్తూ, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలని, స్టార్టప్ లకు మద్దతు ఇవ్వాలని, రిస్క్ క్యాపిటల్ ను పొందేందుకు వీలు కల్పించాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారతదేశ ఆశయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దార్శనికతను సాధించడంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. భారతదేశ పురోగతిని గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలలో వేగవంతమైన పురోగతిని ఆయన ఉదహరించారు. డిజిటల్ చెల్లింపులలో నాయకత్వం, కోడివ్–19 వ్యాక్సినేషన్ల వంటి భారీస్థాయి ప్రజా సేవల పంపిణీని కూడా ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి రంగాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) యొక్క పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వర్తమాన కాలాన్ని 'భారతదేశ దశాబ్దం'గా అభివర్ణిస్తూ, అమితాబ్ కాంత్ దేశానికి ఉన్న జనాభా పరమైన ఆధిక్యతను ఎత్తిచూపుతూ, పట్టభద్రులు ఆశావాదంతో, నూతన ఆవిష్కరణతో, దేశ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.తొలుత, ముఖ్య అతిథి, ఇతర ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేయడంతో ఈ వేడుక లాంఛనంగా ప్రారంభమైంది.




గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో, పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ అమితాబ్ ను పరిచయం చేశారు.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు విద్యార్థి ప్రతినిధి సెహజానా కాంట్రాక్టర్ తో ప్రమాణ స్వీకారం ప్రతిని అందించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది విద్యార్థులకు వారి డిగ్రీలతో పాటు, విద్యా నైపుణ్యాన్ని గుర్తించే మెరిట్ పతకాలను ప్రదానం చేశారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ లో మొదటి ర్యాంకు సాధించిన అభిజీత్ సుధీర్ రౌత్ కు అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన బంగారు పతకం ఇచ్చి సత్కరించారు. ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను సిమ్రాన్ కౌర్ డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జునరావు స్మారక బంగారు పతకాన్ని అభిజీత్ సుధీర్ రౌత్, అమల్ శుక్లాలకు సంయుక్తంగా ప్రదానం చేశారు.రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సంతకం కోసం డిగ్రీ రికార్డులను సమర్పించారు. విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, కేఎస్ పీపీ అధ్యాపకురాలు డాక్టర్ వసుధా కడ్జు వందన సమర్పణ చేశారు. కేఎస్ పీపీ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ కూడా పాల్గొన్నారు.పబ్లిక్ పాలసీ, పరిపాలన రంగంలో తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించనున్న పట్టభద్రుల బృందానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.




# కాగజ్‌నగర్‌లో షీ టీం అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, ఆదర్శ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ నితిక పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, మహిళల భద్రత, డయల్ 112 వినియోగం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైతే షీ టీం (8712670565), భరోసా (8712670561) నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షీ టీం, భరోసా సభ్యులు పాల్గొన్నారు

# ఆసిఫాబాద్‌లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పట్టణంలోని 17వ, 10వ వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. వీధులు, మురుగు కాలువల శుభ్రతను తనిఖీ చేసి ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం తొలగించాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డులో పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి లింగ బసవ గార్డెన్‌లో శుక్రవారం చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. చేనేత రుణమాఫీ పథకం కింద రూ.19.24 కోట్లు, నేతన్న భరోసా పథకం కింద రూ.3.29 కోట్లు, నేతన్న బీమా పథకం కింద రూ.2.40 కోట్లు విడుదల చేసి జిల్లాలోని చేనేత కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ పథకాల ద్వారా చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, అదనపు కలెక్టర్లు భాస్కరరావు, వెంకరెడ్డి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, సిబ్బంది, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ బయలుదేరిన అమెరికా జేడీ వాన్స్ : ఇంకా బయలుదేరని ఇరాన్.!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :**
ఇరాన్ తో శాంతి చర్చల్లో భాగంగా అమెరికా వైస్ ప్రసిడెంట్ జేడీ వాన్స్ శుక్రవారం పాకిస్తాన్ బయల్దేరారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ రవాణా ఎయిర్ క్రాఫ్ట్ లో ప్రయాణిస్తున్న వైస్ ప్రసిడెంట్ నూర్ ఖాన్ బేస్ కు చేరుకుంటారు. యుద్ధానికి ఒక ముగింపు వస్తుందేమోనన్న ఆశాభావంతో ఉన్నట్లు బయల్దేరే ముందు వాన్స్ తెలిపారు. ప్రసిడెంట్ ట్రంప్ చెప్పినట్లు.. ఇరాన్ శాంతి చర్చలకు వస్తే మేము వాళ్లకు స్నేహ హస్తం ఇస్తాం. ఒకవేళ మాతో గేమ్స్ ఆడుకోవాలని చూస్తే చర్చలంటూ ఏమీ ఉండవు. ఇరాన్ కు ఎలా బుద్ధి చెప్పాలా అలా చెబుతాం.. అని అన్నారు. ఇస్లామాబాద్ లో జరగున్న చర్చలలో అమెరికా ఇరాన్ మధ్య దశాబ్దాల తర్వాత కీలకంగా మారనున్నాయి. ఈ విషయంలో ప్రసిడెంట్ ట్రంప్.. క్లియర్ గైడ్ లైన్స్ ఇచ్చారని.. ఎలా ఉంటుందో మున్ముందు తెలుస్తుందన్నారు. ఇక చర్చల్లో భాగంగా ఇరాన్ కూడా పాకిస్తాన్ కు రావాల్సి ఉంది. అయితే ఆలస్యంగా శుక్రవారం రాత్రికి ఇరాన్ బృందం ఇస్లామాబాద్ చేరుకోనుంది. శనివారం (ఏప్రిల్ 11) ఇరు దేశాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొననున్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ గలిబా చర్చల్లో కీలక పాత్ర పోషించనున్నారు. ఇస్లామాబాద్ లోని సెరెనా హోటల్ లో చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. దీనిపై పాక్ అధికారిక ప్రకటనలు చేయలేదు. కానీ.. హోటల్ ఖాళీ చేయాల్సిందిగా ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా.. చర్చలు అక్కడే జరగనున్నట్లు చెబుతున్నారు.

# ఆస్తుల్లో మమతా దీదీ తక్కువ..కేసుల్లో సువేందు ఎక్కువ!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కోల్‌కతా:**
వెస్ట్ బెంగాల్ లోని భవానీపూర్ నుంచి ఇదివరకే నామినేషన్ దాఖలు చేసిన సీఎం మమతా బెనర్జీ, ఆమెపై పోటీ చేస్తున్న ప్రతిపక్ష నేత సువేందు అధికారి తమ ఆస్తులను అఫిడవిట్‌లో ప్రకటించారు. మమత మొత్తం చరాస్తులు రూ.15.37 లక్షలు కాగా 2021లో ఇది రూ.16.7 లక్షలుగా ఉంది. ఆమెకు సొంత ఇల్లు, కారు, భూములు, షేర్లు, బాండ్లు, బీమా పాలసీలు లేవు. చేతిలో రూ. 75,700 నగదు, రూ. 1.45 లక్షల నగలు ఉన్నాయి. ఇక బీజేపీ నేత సువేందుకు రూ. 61.30 లక్షల ఇల్లు, ఫ్లాట్, 2.46 ఎకరాల భూమి ఉన్నాయి. చరాస్తులు రూ. 24.57 లక్షలు, 25 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన ఆదాయం రూ. 17.38 లక్షలు. ఇది 2021 ఎన్నికల నాటి కంటే దాదాపు రెట్టింపు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తలపడిన వీరిద్దరూ ఈసారి భవానీపూర్ వేదికగా రెండోసారి పోటీ పడుతున్నారు. సువేందు అధికారి ఈసారి నందిగ్రామ్, భవానీపూర్ రెండు చోట్ల బరిలో నిలిచారు

# నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం జాల గ్రామానికి తాగునీటి సమస్య తీర్చేందుకు మోటారు పైపులు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అందజేయగా సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు, ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. సర్పంచ్ పాలకవర్గ సభ్యులు గ్రామంలో నీటి సమస్యను విన్నవించుకున్న వెంటనే మోటారు పైపులు అందజేసినట్లు నీటి సమస్యను తీర్చినట్లు చెప్పారు. ప్రజల పక్షాన కృతజ్ఞతలు చెప్పారు. సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు, ఉప సర్పంచ్ కొల్లూరు లావణ్య కరుణాకర్, కొండ ముత్యంరెడ్డి, పారుపల్లి సత్తిరెడ్డి, గుంటి రామచంద్రారెడ్డి, గుంటి భీశ్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# రైతులకు పంట మార్పిడి పై అవగాహన కార్యక్రమం,...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలశీ లోనీ వ్యవసాయ కార్యాలయం లో (ఎ డి ఎ) మనోహర్ ఆధ్వర్యంలో రైతులకు పంట మార్పిడి పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా రైతు సోదరులు ఆయిల్ పామ్ సాగు చేసి మంచి దిగుబడులు సాధించాలని అన్నారు. అలాగే పంట మార్పిడి చేయడం వళ్ళ భూసారం పెరుగుతుంది అని అన్నారు. రైతు సోదరులు సేంద్రియ వ్యవసాయశీ పైన మొగ్గు చూపాలని అన్నారు. ఆలాగే ఆయిల్ పామ్ సాగు చేయడం వలన అధిక మొత్తంలో లాభాలు ఆర్జిస్తారు. అదే విధంగా వరి పంట సాగు చేసే ముందు జనుము, జిలుగు వేసి కలియ దున్నడం వల్ల భూ సారం పెరుగుతుంది. అని సూచనలు ఇచ్చారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడటం వలన పర్యావరణ కాలుష్యం కాకుండా భూ సారం దెబ్బ తింటుంది. కావున యూరియా వాడకం తగ్గించి రైతులు నానో ఎరువులు వైపు మొగ్గు చూపాలి. మరియు జీవామృతం మరి వేప నూనె వంటి సేంద్రీయ రసాయనాలు వాడాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఈ ఓ ఎస్ మరియు ఆత్మ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ హరిత





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల వెంట లైటింగ్, సర్వీస్ రోడ్లు, స్పీడ్ బ్రేకర్లు, డ్రైన్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలు పెంచి, మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం, హెల్మెట్, సీటుబెల్ట్ లేని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారుల మరమ్మత్తులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదాల సమయంలో బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాలు తగ్గించాలని పేర్కొన్నారు.

# రాజపేట పిఎసిఎస్ కు 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని 12 గ్రామాలకు పిఎసిఎస్ కు ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరి అయినట్లు సెక్రటరీ సిల్వేరు చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు చెబుతూ రాజపేట, పాముకుంట, పుట్టగూడెం, సింగారం, కుర్రారం, బొందుగుల, సోమవారం, లక్ష్మక్కపల్లి, చల్లూరు, బేగంపేట, రేణికుంట, నర్సాపురం గ్రామాల పరిధిలో కేంద్రాలు మంజూరి కాగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా ఐకెపి కి మంజూరి అయిన ఏడు కేంద్రాలలో సింగారం గ్రామం కూడా ఉండడం పట్ల అటు ఐకెపి ఇటు పిఎసిఎస్ వారు అయోమయంలో పడ్డారు.

# భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్





**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శిక్షణలోని అంశాలు ఆచరిస్తే గుర్తింపు : ఎంపీడీవో నాగవేణి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** **శిక్షణలో**ని అంశాలను ఆచరిస్తే గుర్తింపు గౌరవం మరింత పెరుగుతుందని ఎంపీడీవో నాగవేణి అన్నారు. శుక్రవారం రాజపేట మండల పరిషత్ కార్యాలయంలో 13 మంది వార్డు సభ్యులకు జనరల్ ఓరియంటేషన్ రెండవ బ్యాచ్ ఐదు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ అభివృద్ధిలో ఉత్తమ గ్రామపంచాయతీ ఎంపికలో వార్డు సభ్యుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. మహాత్మా గాంధీ పేర్కొన్న గ్రామ స్వరాజ్యం వార్డు సభ్యుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా వార్డు సభ్యులు విధులు బాధ్యతలు నిర్వర్తించాలని బలమైన పటిష్టమైన ఆదర్శవంతమైన గ్రామపంచాయతీ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర కీలకమన్నారు. ఐదు రోజుల శిక్షణ విజయవంతంలో టిఓటి లు జమ్లా నాయక్ మెండు సంతోష్ రెడ్డి, చక్రధర్, రేకులపల్లి భాస్కర్ రెడ్డిల పాత్ర అమోఘమని ప్రశంసించారు. ఎంపీఓ ఆవుల కిషన్ మాట్లాడుతూ పాలకవర్గంలో వార్డు సభ్యుల పాత్ర విశిష్టమైనదని గుర్తు చేశారు. అనంతరం తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా పంపిణీ అయిన ధ్రువీకరణ పత్రాలను వార్డు సభ్యులకు అందజేసి అభినందించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి కుట్టు శిక్షణ దోహదం : సర్పంచ్ ఇంజ లక్ష్మీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** **మ**హిళలు స్వశక్తితో ఎదగడానికి కుట్టు శిక్షణ కేంద్రాలు ఉపయోగపడతాయని రాజపేట మండలం కాల్వపల్లి గ్రామ సర్పంచ్ ఇంజ లక్ష్మీ అన్నారు. శుక్రవారం హ్యాండ్ ఆప్ హెల్త్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. హ్యాండ్ ఆఫ్ హెల్త్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జైపాల్ రెడ్డి తబీత, కోఆర్డినేటర్ క్రిస్టఫర్, పాస్టర్ స్టీవెన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, ఉప సర్పంచ్ కళ్లెం పాండు, వార్డు సభ్యులు చేర్యాల లక్ష్మయ్య, కళ్ళెం గణేష్, పెంట ఆంజనేయులు, ఇంజ కృష్ణ, ఇంజ స్వప్న బాబు ఇంజ మనేమ్మ మదర్ పాల్గొన్నారు.

# బేగంపేట ప్రజా భవన్ లో గోడు...

## రుద్రారం జిపిఆర్ శ్రీ సాయినాథ్ గార్డెన్స్" మోసంపై బాధితుల ఆవేదన




**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :** బేగంపేట ప్రజా భవన్‌లో శ్రీ సాయినాథ్ గార్డెన్స్ లేఅవుట్ బాధితులు తమ గోడును వినిపిస్తూ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. రుద్రారం గ్రామంలో ఉన్న ఈ లేఅవుట్‌పై భారీ మోసం జరిగిందని ఆరోపిస్తూ ప్లాట్ యజమానులు బేగంపేట ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.

-బేగంపేట ప్రజా భవన్‌లో మా గోడును వినిపించాం... జీపీఆర్ శ్రీ సాయినాథ్ గార్డెన్స్ మోసంపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అని బాధితులు విజ్ఞప్తి చేశారు.

-డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ పాస్‌బుక్స్ వల్ల మా ఆస్తులు ప్రమాదంలో పడ్డాయి... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని వారు పేర్కొన్నారు.

**ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం** ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మా ప్లాట్లకు పూర్తి హక్కులు కల్పించాలి" అని బాధితులు కోరారు.సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు జిపిఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2000లో గ్రామపంచాయతీ అనుమతితో సుమారు 218 ఎకరాల్లో 70 సర్వే నంబర్లలో శ్రీ సాయినాథ్ గార్డెన్స్ లేఅవుట్‌ను అభివృద్ధి చేసింది. అనంతరం 2002 నుంచి సుమారు 3100 ప్లాట్లను విక్రయించినట్లు సమాచారం. అయితే ప్లాట్ల విక్రయంలో అసలు వివరాలను దాచిపెట్టి, కొన్ని సర్వే నంబర్లను మాత్రమే చూపిస్తూ రిజిస్ట్రేషన్లు చేసి కొనుగోలుదారులను మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇక ఇప్పటికే ప్లాట్లుగా విక్రయించిన భూములను వ్యవసాయ భూములుగా చూపిస్తూ బ్యాంకులకు తాకట్టు పెట్టడం, రుణాలు చెల్లించకపోవడంతో వేలం ప్రక్రియలు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో అక్రమంగా పట్టాదారు పాస్‌బుక్స్ జారీ చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.ఇటీవల 16-01-2026న డాక్యుమెంట్ నంబర్ 60/2026 ద్వారా అదే భూములను మళ్లీ వ్యవసాయ భూములుగా చూపిస్తూ డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ ఈ రిజిస్ట్రేషన్లు జరిపినట్లు బాధితులు చెబుతున్నారు.అదే విధంగా జనవరి 25న కొందరు వ్యక్తులు యంత్రాలతో లేఅవుట్‌లోకి ప్రవేశించి ప్లాట్ల కాంపౌండ్ గోడలను కూల్చివేయడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆదేశాలను కూడా లెక్కచేయకుండా ఈ చర్యలు చేపట్టారని



ఆరోపిస్తున్నారు. డెట్ రికవరీ ట్రైబ్యునల్ జారీ చేసిన అటాచ్మెంట్ ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు జరిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ ఘటనలతో ప్లాట్ యజమానులు భారీ ఆర్థిక నష్టం, మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఇప్పటికే జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదులు అందజేసిన బాధితులు... అక్రమంగా జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్స్‌ను రద్దు చేసి, డబుల్ రిజిస్ట్రేషన్లను నిలిపివేసి తమ హక్కులను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం సంగారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టిస్తుండగా, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రవిణ్య

## బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :** పటాన్‌చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్‌లోని ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య, పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కలిసి సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు నేపథ్యంలో ఇళ్లు కూల్చి అపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రతిపాదనపై కాలనీ ప్రజల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ ప్రవిణ్య తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో జీఓ 58 జీఓ 59 ద్వారా తమ ఇళ్లకు రెగ్యులరైజేషన్ పట్టాలు పొందామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి ఇంటి యజమానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినందున, ప్రస్తుతం ఉన్న ఇళ్లను కూల్చి అపార్ట్‌మెంట్‌లుగా నిర్మించాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు తమకు వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. తమకు ఇప్పటికే ఉన్న ఇళ్లలోనే అభివృద్ధి చేసుకునే విధంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు.2017 సంవత్సరంలో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా 221 ఇళ్లు కోల్పోయిన బాధితులకు అప్పట్లో రెవెన్యూ శాఖ ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు కేటాయించలేదని ఆదర్శ్ రెడ్డి కాలనీ ప్రజల తరఫున జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు కోల్పోయిన వారు అద్దె ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.మాజీ కార్పొరేటర్ సింధు



ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో ఉన్న ఇళ్లకు ఇంటి పన్ను విధించే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కాలనీ ప్రజలు వినిపించిన సమస్యలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్ వసంత పై దాడి చెసిన దుండగులను తక్షణమే శిక్షించాలి

## అంగన్వాడి యూనియన్ సిఐటియు యాదాద్రి జిల్లా అధ్యక్షులు బూర్గు స్వప్న

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాజెక్టు కాంగ్టి మండలం రాసోల్ గ్రామంలో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్ వసంత కుమారీని ఆ గ్రామంలోని ఇద్దరు మహిళలు ముగ్గురు పురుషులు కలిసి చెట్టుకు కట్టేసి కొట్టడంతో పాటు గుండు గీయిస్తామని గాడిద మీద కూర్చోబెట్టి ఊరంతా తిప్పుతామని అనేక రకాలుగా హింసించిన ఈ ఐదుమంది దుండగులను తక్షణమే శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అంగన్వాడి యూనియన్ సిఐటియు యాదాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, చిలువేరు రామకుమారీ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వసంత కుమారి అదే గ్రామంలో 1985 నుండి అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహిస్తూ బెస్ట్ అంగన్వాడి టీచర్ గా ఆమెకు పేరు ఉన్నదన్నారు . ఏప్రిల్ 7వ తేదీన అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వసంత కుమారీని మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆ గ్రామానికి చెందిన ఐదు మంది సభ్యులు వసంత కుమారిని కేంద్రం నుండి బయటకు లాక్కెళ్ళి చెట్టుకు కట్టేసి కొట్టడం జరిగిందని, కొడుతున్న క్రమంలో వసంతకుమారి వారిని కొట్టొద్దని వేడుకున్నప్పటికీ వినలేదన్నారు. వసంత కుమారి భర్త ప్రైవేట్ సంస్థలో 12 సంవత్సరాల క్రితం వచ్చినప్పుడు ఏజెంట్ గా పనిచేశాడని, ఆ గ్రామంలో ఉన్న ప్రజల వద్ద డబ్బు వసూలు చేసి ఆ సంస్థలో కట్టాడని, తర్వాత ఆ సంస్థ అందరినీ మోసం చేయగా వసంతకుమారి భర్తతో పాటు ఆ సంస్థలో పనిచేసిన ఏజెంట్స్ అందరూ ఆ సంస్థ పైన కేసు పెట్టారని, ఈ అంశానికి వసంత కుమారికి ఎలాంటి సంబంధం లేదని అయినా కట్టేసి కొడుతున్న క్రమంలో ఉన్న ఒక ఎకరా పొలం అమ్మి డబ్బులు చెల్లిస్తానని ప్రాధేయపడినప్పటికీ వినలేదన్నారు. కనికరించకుండా చెట్టుకు కట్టేసి కొట్టడమే కాదు, గుండు గీయిస్తామని ఊరంతా గాడిద మీద తిప్పుతామని వాళ్ళు అనేక రకాలుగా వసంత కుమారిని ఇబ్బందులకు గురి చేశారన్నారు . ఈ క్రమంలో వసంతకుమారి తోటి అంగన్వాడీ టీచర్స్ కు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి తక్షణమే పరిసర గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ టీచర్స్ సిఐటియు నాయకులు సంఘటన స్థలానికి వెళ్లి దాడి చేస్తున్న వారిని ఖండించి ఆమెను విడిపించడం జరిగిందని సంఘటనను వివరించారు. విధుల్లో ఉన్న అంగన్వాడి టీచర్ ను లాకెల్లడం, మహిళ పేరుతో ఇష్టం వచ్చిన బూతులు తిట్టడం, చెట్టుకు కట్టేసి కొట్టడం, సంబంధంలేని ఆర్థిక అంశాన్ని అంగన్వాడీ టీచర్ పైన మోపడం అత్యంత దుర్మార్గమని వీరిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని, అలాగే ప్రజలను మోసం చేసిన ఆ సంస్థ పైన తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంస్థ నుండి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వమే ప్రజలకు చెల్లించే బాధ్యత చేపట్టే విధంగా, కుమారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం రక్షించాలని డిమాండ్ చేశారు.



# మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

**ఒకే సమస్య ఒకే సర్వీస్ రూల్ అమలు చేయాలి.**

**ఆర్టిజన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.**

**జేఏసీ ఆధ్వర్యంలో వంట వార్పు, కళ్లకు గంతలు కట్టి నిరసన తెలపడం జరిగింది.**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10 :** విద్యుత్ ఆర్టిజన్, మీటర్ రీడర్లను, పీస్ రేట్ కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మూడవరోజు నిరవధిక సమ్మెలో భాగంగా పటాన్చెరు డివిజన్ కార్యాలయం ఎదుట వంటావార్పు మరియు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపడం జరిగింది. అనంతరం రాష్ట్ర డివిజన్ జేఏసీ నాయకులు భూపాల్ రెడ్డి , పర్వయ్య , రఘు మాట్లాడుతూ ఒకే సమత్సలో రెండు రూల్స్ అమలు చేయడం కరెక్ట్ కాదని, చేస్తున్న పని ఒకటే అయినప్పుడు రెండు రూల్స్ అమలు చేయడాన్ని తప్పు పట్టారు ఒకే సంస్థలో ఒకే పని చేస్తున్నప్పుడు రెండు రూల్స్ అమలు చేసి బ్రిటిష్ కాలం నాటి రూల్స్ ను అమలు చేసి కార్మికుల జీవితాలతో శ్రమ దోపిడీకి గురిచేస్తున్న యాజమాన్యం ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు. అప్పటి కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆర్టిజన్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు పాదయాత్రలో హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తమ హక్కులను నెరవేర్చేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేస్తున్న భట్టి విక్రమార్క మాట మార్చడం బాగోలేదని విద్యుత్ కార్మికులను




పట్టించుకోవడంలేదని తెలిపారు విద్యుత్ సమస్యలు ఏదైనా తలెత్తే మాత్రం యాజమాన్యం ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా జేఏసీ నాయకులు పలు యూనియన్ల సంఘాల అధ్యక్షులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, ఉపేందర్, నరసింహ, అక్షయ్, ముజీబ్, మురళి, సుధాకర్ ఎల్లేష్ కార్మికులు పాల్గొన్నారు.

# సమిష్టి నిర్ణయాలే అభివృద్ధికి దారి.. ఏకపక్ష నిర్ణయాలపై సూర్యచంద్ర విమర్శలు

**26 వేల ఇళ్ల స్థలాల ప్రకటన పేదలకు నష్టమా?**

**ఎలివేటెడ్ బ్రిడ్జ్ లేదా బైపాస్ రోడ్‌పై ప్రజాభిప్రాయం కోరిన సూర్యచంద్ర**

**ఏలేరు ఆధునీకరణకు 2000 కోట్లు కేటాయించాలని డిమాండ్**

**అక్రమ మట్టి, గ్రావెల్ దందాపై ప్రజలు స్పందించాలని పిలుపు**

**కాపు కళ్యాణ మండపం ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచన**

**జగ్గంపేట, ఏప్రిల్ 10 : హైదరాబాద్ పల్స్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే తిరోగమనం తప్పదని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర పేర్కొన్నారు. జగ్గంపేట నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై ఆయన స్పందిస్తూ, గోకవరం మండలం గాదెలపాలెం నుంచి కిర్లంపూడి మండలం కృష్ణవరం వరకు ఉన్న 73 కిలోమీటర్ల పోలవరం లెఫ్ట్ కెనాల్ పరిధిలో 850 ఎకరాల్లో మట్టి తొలగించి 26 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రతిపాదనలు సిద్ధం చేయడం పేదలకు నష్టమయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జగ్గంపేటలో సుమారు 15 వేల మందికి జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చినా, వాటిలో చాలా స్థలాలు నివాసయోగ్యంగా లేకపోవడం, కోర్టు వివాదాల్లో ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. మళ్లీ పోలవరం భూములపై స్థలాలు ఇస్తే భవిష్యత్తులో రైతులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని, చివరికి పేదలకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో రైతులకు నష్టం లేకుండా ఎక్కువ ధర చెల్లించి భూములు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా జగ్గంపేటలో ఎలివేటెడ్ క్యారిడార్ లేదా బైపాస్ రోడ్ నిర్మాణంపై రైతులు, వ్యాపారులు, నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే భారీ నష్టాలు సంభవించే అవకాశముందని హెచ్చరించారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏలేరు ఆధునీకరణకు



రూ. 2000 కోట్లు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మట్టి, గ్రావెల్ దందాలను ప్రజలు ప్రశ్నించాలని, వాటి ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా జగ్గంపేటలో నిర్మించిన కాపు కళ్యాణ మండపాన్ని సామాన్య ప్రజలకు వివాహాలు, శుభకార్యాల కోసం అందుబాటులోకి తేవాలని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు.

# మూడు గంటల్లోనే బంగారం రికవరీ చేసిన జగ్గంపేట పోలీసులు

**పోలీసుల పనితీరుపై ప్రశంసలు వెల్లువ**

**జగ్గంపేట, ఏప్రిల్ 10 : హైదరాబాద్ పల్స్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేటలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, కేవలం మూడు గంటల వ్యవధిలో పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. జగ్గంపేటకు చెందిన ఓ మహిళ తన కుమారుడితో శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో జగ్గంపేటకు వచ్చారు. అయితే గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత ఆటోలో తమ బ్యాగ్ మర్చిపోయిన విషయం తెలుసుకుని ఆందోళనకు గురయ్యారు. ఆ బ్యాగులో దుస్తులతో పాటు సుమారు రూ. 4.5 లక్షల విలువైన 34 గ్రాముల బంగారు ఆభరణాలు ఉండటంతో, మహిళ వెంటనే జగ్గంపేట పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం ఇన్చార్జి డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు, ఎస్సై టి. రఘునాథరావు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. పోలీసులు జగ్గంపేట పోలీస్ స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, దేవి సెంటర్, కాకినాడ రోడ్‌లోని కాట్రావులపల్లి ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సంబంధిత ఆటోను గుర్తించారు. చివరికి కేవలం మూడు గంటల వ్యవధిలోనే బ్యాగ్‌ను, అందులో ఉన్న బంగారు వస్తువులను సురక్షితంగా స్వాధీనం చేసుకుని బాధిత మహిళకు అప్పగించారు. తనకు విలువైన బంగారం తిరిగి దక్కినందుకు మహిళ



ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీతో పాటు జగ్గంపేట పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గంపేట సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ, ప్రయాణికులు ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ గురించి... మందుబాబులకు హైకోర్టు గుడ్ న్యూస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, హైదరాబాద్:** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు అనగానే వాహనదారులకు గుర్తొచ్చేది బండి సీజింగ్. కానీ, ఇకపై ఆ ఆటలు సాగవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. మద్యం తాగి వాహనం నడిపారనే సాకుతో వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసు అధికారులకు లేదని హైకోర్టు పునరుద్ఘాటించింది. ఈ మేరకు గతంలో ఉన్న ఆదేశాలను అమలు చేయాలని పోలీసు శాఖను ఆదేశించింది.

జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్ ఈ కేసును విచారిస్తూ..లి మోటారు వాహనాల చట్టం ప్రకారం పోలీసులకు ఉన్న పరిమితులను గుర్తుచేశారు.

**సీజింగ్ పవర్ లేదు:** డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని తెలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు కానీ, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించకూడదు.

**ప్రత్యామ్నాయం చూపాలి:** ఒకవేళ డ్రైవర్ ఒక్కడే ఉండి, బండి నడపలేని స్థితిలో ఉంటే.. పోలీసులు వెంటనే అతని బంధువులకు లేదా స్నేహితులకు సమాచారం అందించాలి. వారు వచ్చి వాహనాన్ని తీసుకెళ్లేలా చూడాలి.

లైసెన్స్ ఉన్న వ్యక్తికి అప్పగించాలి:లి వాహనంలో ఉన్న మరొకరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, వారు మద్యం సేవించకుండా ఉంటే.. వారికి వాహనాన్ని అప్పగించి పంపేయాలి.

**పోలీసుల అత్యుత్సాహంపై చురకలు!**

చాలా సందర్భాల్లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం వల్ల వాహనాలు పాడవుతున్నాయని, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని కోర్టు అభిప్రాయపడింది. ఎవరూ లేని పక్షంలో వాహనాన్ని క్షేమంగా పార్క్ చేయించాలే తప్ప, చట్టవిరుద్ధంగా సీజ్ చేయకూడదని జస్టిస్ వేణుగోపాల్ స్పష్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికాడు... పోలీసు స్టేషన్ ఎదుటే ఆత్మహత్య..!

**గతంలో ఉన్న రూల్స్ ఏంటి?**

నిజానికి తెలంగాణలో ఈ నిబంధన ఎప్పటి నుంచో ఉంది. గతంలో కూడా హైకోర్టు ఇవే ఆదేశాలు ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో పోలీసులు ఇప్పటికీ



వాహనాలను సీజ్ చేస్తూనే ఉన్నారు. తాజా తీర్పుతో పోలీసులు తమ తీరు మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ పోలీసులు నిబంధనలు అతిక్రమించి బండిని సీజ్ చేస్తే.. వాహనదారులు హైకోర్టు తీర్పును కోట్ చేస్తూ న్యాయం పొందవచ్చు. ఈ తీర్పు అంటే మందు తాగి బండి నడపమని కాదు.. తాగి దొరికితే చట్టపరమైన జరిమానా కట్టాల్సిందే, కానీ ఆ సాకుతో వాహనాన్ని లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెప్పినట్లు అర్థం చేసుకోవాలి.

# కైలాసపురం శ్రీ వాసవి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట భువనగిరి జిల్లా ఆలేరు నియోజక వర్గం కాచారం ( కైలాస పురం) లోని శ్రీ వాసవి రేణుక ఎల్లమ్మ బసవ లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ధార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు బత్తుల ఎలేందర్ సునీత యాదవ్ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అర్చన విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగారం 2 వ వార్డ్ సభ్యులు వల్లాల అనిత ఎలేందర్, 4 వ వార్డ్ సభ్యులు రేణుక చంద్రమౌళి, ఆత్మకూరు, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదం అందజేసిన ఆలయ నిర్వాహకులు

# సిపిఐ (ఎంఎల్) ఎన్ డి ఆర్ ఆధ్వర్యంలో కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు 11వ వర్ధంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరులో పార్టీ కార్యాలయంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సంస్థ స్థాపకుడు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పంగ అంజయ్య మాట్లాడుతూ కళ కల కోసం కాదని, కళ కాసుల కోసం కాదని, కళ ప్రజల కోసమని ప్రజా చైతన్యం కోసమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమని భావించి కామ్రేడ్ కానూరి బాల్యం నుండి తన జీవితమంతా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో ప్రజలను చైతన్యం చేయడానికి వివిధ కళారూపాలలు ప్రదర్శించాడని అన్నారు. కామ్రేడ్ కానూరి జీవితం నేటి రచయితలకు, కవులకు, కళాకారులకు, గాయకులకు, స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.రవి, జె.మల్లేష్, పి.వరలక్ష్మి, కే.సునీత, పి.నాగరాజు, పి.సరిత, డి.అంజయ్య,పి.జయమ్మ, జే.సత్తమ్మ, పి.సునీల్, జె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# గొలుసు కట్టు చెరువులన్నింటినీ నింపాలి

**రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని గొలుసు కట్టు చెరువుల ను తక్షణమే నింపి కరువు ప్రాంతమైన రాజపేటను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం లు అన్నారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బొందుగులలో పాల్గొని మాట్లాడారు. తలాపున తపాస్ పల్లి ప్రాజెక్టు ఉన్నప్పటికీ చెరువులు ఎండిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం జలాలు వాగుల ద్వారా వృధాగా పోతున్నాయని వాటిని ప్రణాళిక బద్ధంగా, యుద్ధ ప్రాతిపదికన తక్షణమే గొలుసు కట్టు చెరువులన్నింటిని నింపి మండల రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండో విడతలో అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడిన వారందరికీ తారతమ్య భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందజేయలని కోరారు. లేనిచో సిపిఐ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లూరి రాములు, తరిగొప్పుల సిద్ధులు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మల్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం మల్లగూడెం గ్రామ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని శుక్రవారం పిఏసిఎస్ సెక్రటరీ సిల్వేరు చంద్రశేఖర్ గౌడ్ కు సర్పంచ్ జెన్నపల్లి బాలరాజు రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు రైతులు వినతి పత్రం అందజేశారు. సుమారు 20 లారీల ధాన్యం పంట పండుతుందని నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాముకుంట ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలంటే ఇబ్బందులు నష్టాలు ఎదురవుతున్నాయని వివరించారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారని వెంటనే కిలోమీటర్ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## రేణికుంటలో హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ కర్రె వెంకటేష్.





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా** ప్రతినిధి : రాజపేట మండలం రేణికుంట గ్రామంలో శుక్రవారం జరిగిన వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రేణికుంట గ్రామంలో హెల్త్ క్యాంపు జరిగింది. ఈ క్యాంపును గ్రామ సర్పంచ్ కర్రె వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం వల్ల అందరికీ వైద్యం అందుతుందని పేర్కొన్నారు బిపి, షుగర్, క్యాన్సర్, టీబీ వారికి పరీక్షలు చేసి మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఎక్సటెన్షన్ ఆఫీసర్ భీకు నాయక్, హెల్త్ అసిస్టెంట్లు ఉపేందర్, కవిత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ

### స్వామివారి నిత్య రాబడి రూ.11.45 లక్షలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ఉంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉంజల్ సేవను ఆలయ పురవీధులలో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ నిత్య రాబడి లో భాగంగా శుక్రవారం రోజున రూ.11,45,649 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు, కిరణ్ కుమార్ చార్యులు మురళి కుమార్ చార్యులు, ఇన్చార్జి చంద్రమౌళి, కొమ్ము గాని కుమార్ ఎస్పీఎఫ్ సిబ్బంది పాండు మురళి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన మార్గదర్శి




**శ్రీరమణ మహర్షి 'మౌనముని'గా ప్రసిద్ధి చెందారు. మౌన ధ్యానాన్ని ఆయన ఎక్కువగా బోధించేవారు. అరుణాచలంలోని ఆశ్రమంలో తనను దర్శించుకోవడానికి వచ్చిన వారు వ్యక్తపరిచే సందేహాలను తీర్చాల్సి వచ్చినప్పుడు, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి వచ్చినప్పుడు కూడా క్లుప్తంగానే చెప్పేవారు. అయితే ఆ తక్కువ మాటల్లోనే మార్గదర్శనం చేసేవారు.**

శ్రీరమణులను గురువుగా ఆరాధించే ఒక వ్యక్తి ఆయనను కలిశాడు. "స్వామీ! నేను నా గ్రామాన్ని వదిలిపెట్టి, అడవికి వెళ్ళి తపస్సు చేయాలనుకుంటున్నాను. మీ అనుమతి, ఆశీస్సులు కావాలి" అని అడిగాడు. "ఎవరైనా గ్రామాన్ని విడిచిపెట్టవచ్చేమో కానీ ఆత్మను వదిలిపెట్టలేరు. గ్రామం అనేది ఆత్మకన్నా వేరుగా ఉన్నట్టయితే... దాన్ని వదిలిపెట్టడం సాధ్యమయ్యేదేమో. ఆత్మ ఉండే చోటికి అంతర్ముఖంగా చేరుకొని, అక్కడ ఏకాంతంగా జీవించకుండా... గ్రామాన్ని వదిలిపెట్టి అరణ్యంలో నివసించడం వల్ల ప్రయోజనం లేదు. అది నగరంలో నివసించడం లాంటిదే. ఈ ప్రపంచాన్ని త్యజించానని భావించేవాడు నిజమైన సన్యాసి కాదు. తాను ఒక గృహస్థుడినని భావించని గృహస్థుడే నిజమైన సన్యాసి. తాను సర్వస్వాన్నీ త్యజించానని భావించే వ్యక్తి కన్నా... తన కర్మలన్నిటినీ తానే చేస్తున్నానని భావించని వాడు ఎంతో శ్రేష్ఠుడు" అని బదులిచ్చారు శ్రీరమణులు.

అవన్నీ అసత్యం

ఒక సందర్భంలో శ్రీరమణులు ఒక కథ చెబుతూ "ఒక వ్యక్తి తన ఇంట్లో గాఢంగా నిద్రపోతూ కలగన్నాడు. అతని కలలో... ఎవరో వచ్చి అతని ముక్కులో ఏదో మందు పోశారు, తరువాత కళ్ళకు గంతలు కట్టారు. చేతులను కట్టేశారు. అడవి మధ్యలో వదిలేశారు. అతను దారి తెలియక చాలాసేపు రాళ్ళు, ముళ్ళ మధ్య అడవిలో తిరిగాడు. చివరకు ఏడవడం మొదలుపెట్టాడు. అప్పుడు ఒక దేవత ప్రత్యక్షమై "ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరు నువ్వు? ఇక్కడకు ఎందుకు వచ్చావు?" అని అడిగింది. కళ్ళకు గంతలతో ఉన్న ఆ వ్యక్తి తన వివరాలు చెప్పి "ఎవరో నాకు ఏదో మందు ఇచ్చి, ఇక్కడికి తెచ్చి వదిలేశారు" అన్నాడు. అప్పుడు ఆ దేవత అతని కట్లన్నీ విప్పేసి, దారి చూపించి ఈ దారిలో వెళ్తే నీ గ్రామానికి చేరుకుంటావు" అని చెప్పి అదృశ్యమయ్యాడు. ఆ ఆదేశాలను అనుసరించి అతను క్షేమంగా ఇల్లు చేరుకొని, మంచం మీద పడుకున్నాడు. అక్కడితో కల పూర్తయింది. అతనికి నిద్ర నుంచి మెలకువ వచ్చింది. తను అడవికి వెళ్ళలేదనీ, ఇంట్లోనే నిద్రపోయి కలగన్నాననీ అర్థమయింది. మనం భగవంతుని నుండి వేరుగా ఉన్నామనే భావన, మరియు ఆయనను చేరుకోవడానికి మనం ఏదో కఠోరమైన సాధన చేయాలనే భావన... ఈ వ్యక్తికి తన కలలో కలిగిన ఆలోచనల్లాగానే అసత్యమైనవి.

అతను మంచం మీద సుఖంగా పడుకుని ఉన్నాడు. అంటే మనం అప్పటికే ఆత్మలో నిక్షిప్తమై ఉన్నామని అర్థం. కానీ అతను ఒక అడవిలో బాధపడుతున్నట్టు (అంటే, ఈ ప్రపంచం వాస్తవమని, మనం దానికి లోబడి ఉన్నామనే నమ్మకంలో చిక్కుకొని), మళ్ళీ మంచం మీదకు చేరడానికి గొప్ప ప్రయత్నం చేయాలని (అంటే, ఆత్మను చేరుకోవడానికి లేదా భగవంతుని సాక్షాత్కరించుకోవడానికి సాధన చేయాలని) అతని కల నమ్మేలా చేసింది. భగవంతుణ్ణి పొందాలనే ఆలోచన ఆగిపోయినవారే భగవంతుణ్ణి పొందుతారు, వారు ఆత్మ స్థితిలోనే నిలిచి ఉంటారు. ఆలోచనలు ఎక్కడ ఉద్భవిస్తాయో ఆ ప్రదేశాన్ని మనం గమనించుకుంటూ ఉంటే చాలు" అని వివరించారు.

అదే ఆత్మ... అదే ముక్తి

"ఆత్మజ్ఞానం పొందాలనీ, నా అనుభవాన్ని ఈ లోకానికి, ప్రజానీకానికి చాటాలని ఉంది? దానికి మార్గమేమిటి?" అని శ్రీరమణులను ఒక భక్తుడు అడిగాడు. దానికి ఆయన సమాధానమిస్తూ... "ఇతరులకు బోధించాలన్న ఆలోచనను విడిచిపెట్టి... ముందు నిన్ను నువ్వు తెలుసుకో. ఆ తరువాత లోకం సంగతి ఆలోచించు. తనను తాను తెలుసుకోకుండా లోకానికి సాయపడాలని ప్రయత్నించడం అంటే... దృష్టిలోపం ఉన్న వ్యక్తి నేత్ర సమస్యలున్న ఇతరులకు వైద్య చిట్కాలు సూచించడం లాంటిది" అని చెప్పారు. "నిన్ను నువ్వు తెలుసుకో... అని మీరు చెబుతున్నారు. నేనెవరినో నాకు తెలియడం లేదు" అని ఒకరు సందేహాన్ని వ్యక్తం చేసినప్పుడు... "మనం ఎవరనేది మనకు తెలియకుండానే వేరే ఏదో సాధించాలని కోరుకుంటున్నాం. మనం సాధించాలని కోరుకునేది... వాస్తవానికి మనకు ఇప్పటికే ఉంది. మనకు కలిగే ఏ అనుభవమైనా... అది ఎంత గొప్పదైనా... చివరకు కనుమరుగైపోతుంది. ఏది వస్తుందో, ఏది పోతుందో అది ఆత్మ కాదు. ప్రతి ఒక్కరి అనుభవంలోనూ ఎల్లప్పుడూ నిలిచి ఉండేది ఏదో, అదే మన నిజమైన ఆత్మ, అదే ముక్తి. అదే జ్ఞానోదయం" అని స్పష్టం చేశారు.

## స్వర్గానికి దారి



ఈ ప్రపంచం ఒక తాత్కాలికమైన ఆశ్రయం. ఇక్కడికి మనం శాశ్వతంగా ఉండడానికి రాలేదు. ఒక పరీక్ష కోసం వచ్చాం. మనుష్యులను పరీక్షించడానికే ఈ జీవితాన్ని అల్లాహ్ ఇచ్చాడని అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ చెబుతోంది. ఈ లోకంలో కాదు... పరలోకంలో విజయం సాధించినవాడే నిజమైన విజేత. ఈ ప్రపంచంలో ధనం, ప్రతిష్ట, ఆనందాలు, కష్టాలు... ఇవన్నీ పరీక్షలే. ఆ పరీక్షల్లో విజయవంతమైనవారికి అల్లాహ్ ఇచ్చే ప్రతిఫలం స్వర్గం. మరి ఆ స్వర్గానికి దారి ఎక్కడ ఉంది?దైవ ప్రవక్త మహమ్మద్ దగ్గరకు ఒకసారి ఒక పేద వ్యక్తి వచ్చి "నాకు స్వర్గానికి దారి చూపించండి" అని అర్థించాడు. "అల్ల?హను పూజించు. తప్పనిసరిగా నమాజ్ చెయ్యి. జకాత్ (దానం) ఇవ్వు, సత్యంగా జీవించు. నువ్వు స్వర్గానికి చేరుకుంటావు" అని దైవ ప్రవక్త బదులిచ్చారు. విశ్వాసం (ఇమాన్) స్వర్గానికి ప్రధాన ద్వారం. అల్లాహ్ మీద విశ్వాసం లేకపోతే... చేసిన పనులేవీ పూర్తిగా ఫలించవు. "విశ్వాసం మాటల్లో కాదు... హృదయంలో, పనుల్లో, ప్రవర్తనలో కనిపించాలి. నీ హృదయం మంచి పనిని చూసి ఆనందపడితే, చెడు పనిని చూసి బాధపడితే... అదే నిజమైన విశ్వాసం" అని దైవ ప్రవక్త చెప్పారు. విశ్వాసం దీపం లాంటిది. జీవితంలో చీకటి ఎదురైనప్పుడు... అది వెలుగును ఇస్తుంది. అలాగే స్వర్గానికి నడిపించే మార్గం నమాజ్. అది సాధారణమైన ఆరాధన కాదు. మన ఆత్మకు ఆహారం. శరీరానికి బలాన్ని, మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. రోజూ అయిదుసార్లు అల్లాహ్ ముందు నిలబడి ప్రార్థన చేయడం అంటే... మొత్తం జీవితాన్ని ఆయనకే అంకితం చేయడం. "నమాజ్... విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య ఉన్న గీత" అని దైవ ప్రవక్త స్పష్టం చేశారు.పూర్వం ఒక యువకుడు అనేక చెడు పనులు చేసేవాడు. కానీ నమాజ్‌ను మాత్రం వదిలిపెట్టలేదు. ఒక రోజు అతను నమాజ్ చేస్తూ... "నేను అల్లాహ్ ముందు నిలబడుతున్నాను. కానీ పాపం చేస్తున్నాను" అని అంతర్మథనానికి దురయ్యాడు. ఆ తరువాత క్రమంగా చెడు పనులను విడిచిపెట్టాడు. మరింత దృఢమైన విశ్వాసిగా మారాడు. తన జీవితాన్ని సరి దిద్దుకున్నాడు. నమాజ్ మనిషిలో ఉన్న చెడును తొలగిస్తుంది. ఒక విశ్వాసి నమాజ్ వ్యవస్థను పరిరక్షిస్తే... అల్లాహ్ అతని జీవితాన్ని సరిదిద్దుతాడు.

మహమ్మద్ వహీదుద్దీన్

## ఇద్దరు దూతలు

తన అనంతరం తన సందేశాన్ని లోకానికి వినిపించడానికి కొందరిని ఏసు క్రీస్తు ఎంపిక చేసుకున్నాడు. వారిని వివిధ ప్రదేశాలకు పంపాడు. వారే అపోస్తలులు. గ్రీకు భాషలో 'అపోస్తలుడు' అంటే 'పంపినవాడు', 'దూత' అని అర్థం. ఏసు శిష్యులందరూ అపోస్తలులే. కానీ అపోస్తలునిగా ఉండడానికి శిష్యుడే కాదని నిరూపించిన వ్యక్తి ఒకరున్నారు. అతను పౌలు. అపోస్తలులందరిలో పౌలు, పేతురు వయసులో పెద్దవారు. వీరిద్దరికీ కొన్ని సామ్యాలు ఉన్నాయి, తేడాలూ ఉన్నాయి. కానీ ఇద్దరు దూతల లక్ష్యం ఒక్కటే... ఏసు సువార్తను ప్రకటించడం.పేతురు అసలు పేరు సీమోను. అతను క్రీస్తుతో కలిసి నడిచిన వ్యక్తి. గలలియా తీర నివాసి. ప్రభువు అతణ్ణి 'సీమోను పేతురు' అని పిలిచేవాడు. పేతురు యూదుడు. అతను క్రైస్తవానికి పునాదిరాయిలా నిలబడ్డాడు. చేపలు పట్టే క్రమంలో... ఏసు ఆహ్వానం మేరకు సముద్రతీరంలో ఆయనను వెంబడించాడు. అతను అచ్చమైన యూదుడు... పేతురు. క్రీస్తుకు అనుచరుడిగా... ప్రజలను క్రీస్తు బోధలవైపు మళ్ళించినవాడు. అతను గలగలా పారే సెలయేరు. క్రీస్తు కోసం అతను కారాగారానికి వెళ్ళాడు.పౌలు అసలు పేరు సౌలు. ఏసు గురించి చాలాసార్లు విన్నా ఆయనకు ఎప్పుడూ తారసపడలేదు. కానీ అప్పటికి పరమాణువులా ఉన్న క్రైస్తవాన్ని పరలోకమంత ఎత్తుగా, సువిశాలంగా విస్తృతపరచి, ఔన్నత్యం కల్పించినవాడు పౌలు. దమస్సు మార్గంలో క్రీస్తు భక్తులను పట్టుకొని కొట్టే హింసాత్మక వైఖరి కలిగిన అతను... చివరకు దేవుని పిలుపు అందుకున్నాడు. అతను యూదుడు కాదు... పార్శీయుడు. స్వచ్ఛమైన యోధుడు. అతను కొండనుంచి ఉబికి వస్తున్న, ఎవరూ ఆపలేని ఒక మహా జలపాతం. పేతురు చేసినవి రెండు రచనలు కాగా... పౌలు దాదాపు 27 రచనలు చేశాడు.పౌలు క్రీస్తుకోసం మూడు సార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులోనే రచనలు చేశాడు. పేతురు, పౌలు... వీరిద్దరూ దాదాపు డెబ్బై ఏళ్ళ వయసు వరకూ సువార్తను బోధించారు. మనిషిని మంచి మార్గంలో నడిపించడానికి తపించిన ఆదర్శమూర్తులుగా వీరు చరిత్రలో నిలిచారు.

**డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్**
**9866755024**



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.